


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

మంగళవారం 24 ఫిబ్రవరి 2026 పేజీలు 07


ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను

## సత్వరమే పరిష్కరించే విదంగా చర్యలు

- జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజావాణి కార్యక్రమములో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు.సోమవారం జిల్లా కేంద్రం లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి, అదనపు కలెక్టర్లు, దీపక్ తివారి, ఎం. డెవిడ్, ఆసిఫాబాద్ ఆర్.డి.ఒ లోకేశ్వర రావుతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. అధికారులు తప్పని సరిగా ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం అర్జిదారులన నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణం సందీప్ నగర్ కు చెందిన బోయని నాగేష్ తన తండ్రి మరణ దృవీకరణ జారికి దరఖాస్తు



సమర్పించారు. జైనూర్ మండలం పార గ్రామానికి చెందిన సిద్మారావు తన వ్యవసాయ చేనులో బారి మంజూరి గురించి దరఖాస్తు .రెబ్బెన మండల కేంద్రానికి చెందిన ఎల్కరి పద్మ, తనకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి గురించి దరఖాస్తు. రెబ్బెన మండలం రాళ్ళపేట గ్రామానికి చెందిన రెడ్డి ఉమారాణి ఇందిరమ్మ ఇల్లు మంజూరి గురించి ధరఖాస్తూ.. కౌటాల మండలం తాటి నగర్ గ్రామానికి చెందిన దుర్గం శరత్ చంద్ర తమ గ్రామములో బుద్ధుని మందిరం నిర్మాణానికి అక్రమంగా చందాలు వసూలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని దరఖాస్తు.. ఆసిఫాబాద్ పట్టనం జన్కాపూర్ గ్రామానికి చెందిన అనసూర్య తనకు నర్సింగ్ కాలేజ్‌లో అవుట్ సోర్సింగ్ క్రింద ఉపాది కల్పించాలని దరఖాస్తు. చింతల మానేపల్లి మండలం కింద గ్రామానికి చెందినా రైతు తనకు కర్జెల్లి గ్రామా శివారులో గల భూమిని తనకు తెలియకుండ ఇతరులు పట్టా చేసుకున్నారని చర్యలు గురించి దరఖాస్తు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన ఆత్మకూరి రజిత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరి గురించి దరఖాస్తు. ఈ కార్యక్రమములో సంబందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి

## ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా



కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి అర్జీదారుల నుండి నుండి దరఖాస్తులు స్వీకరించారు. లక్షెట్టిపేట మండలం గోదావరి రోడ్డు ప్రాంతానికి చెందిన మామిడి రాజశేఖర్ నిరుపేద దివ్యాంగుడిని అయిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

మిగితా..2లో

ప్రజావాణి దరఖాస్తులను తక్షణం

## పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**



కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన



ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి దరఖాస్తు ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా శాఖల వారీగా సమీక్షించి నిర్ణీత గడువులో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 98 అర్జీలు అందినట్లు తెలిపారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో స్రవంతి, జడ్పీ సీఈఓ, డీఆర్డీఓ రవీందర్, మైనారిటీ సంక్షేమ అధికారి కలీం, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునీత, ఈడీ-ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, డైరెక్టర్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**నిర్మల్ ప్రతినిధి ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్.**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా



స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలు తనికి చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవి కాలం సమీపిస్తున్నందున విద్యార్థులకు నీటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల మౌళిక సదుపాయాల కల్పన పనులు, మరమ్మత్తులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, అంగన్వాడి భవన నిర్మాణ పనులు, మండల ప్రత్యేక అధికారులు పరిశీలిస్తూ, నిర్మాణాల ప్రగతి, నాణ్యత పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో శంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్ల

## ప్రతిపాదనలు సమర్పించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్



**మంచిర్యాల,ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :**

రాష్ట్రంలో గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి నది తీరం గల జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో గోదావరి పుష్కర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన

మిగితా..2లో

ప్రజలు ట్రాఫిక్ నియమాలు

## తప్పనిసరిగా పాటించాలి

--డా.జి.జానకి షర్మిల

**నిర్మల్ ప్రతినిధి ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్.**

ప్రజల ప్రాణ భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని ప్రారంభమైన రెండవ దశ అరైవ్ అలైవ్ -- 2026 కార్యక్రమం



రెండవ రోజులో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో లేన్ డిసిప్లిన్ డ్రైవ్ దినంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు ,పట్టణ ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు చేపట్టి,

మిగితా..2లో

# గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్ల ప్రతిపాదనలు సమర్పించాలి

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్

**మొదటి పేజీ తరువాయి...**

కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో గోదావరి నది తీరంలో జరగనున్న పుష్కరాల సంబంధిత ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేసి సమర్పించాలని తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం, త్రాగునీరు, వైద్య శిబిరాల ఏర్పాటు, గజ ఈతగాళ్ల ఏర్పాటు, బందోబస్తు ఇతర పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి



చేయవలసిన ఏర్పాట్లను, సంబంధించిన అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో గోదావరి పుష్కరాలు ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా జరిపేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మంచిర్యాల గోదావరి తీరంలో పుష్కర స్నానం కోసం సమీప జిల్లాల నుండి కాకుండా అనేక ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావడం జరుగుతుందని తెలిపారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, జైపూర్ ఎ సి పి లు ప్రకాష్, వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నీటిపారుదల శాఖ డి ఈ ఈ వేణుగోపాల్ రావు, ఈ ఈ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి --డా.జి.జానకి

**మొదటి పేజీ తరువాయి...**

తప్పుగా ఓవర్‌టేకింగ్ చేస్తున్న వాహనదారులను గుర్తించి అవగాహన కల్పించారు.ఎడమ లేన్‌లోనే వాహనం నడపాల్సిన ట్రాఫిక్ నియమాలను






కచ్చితంగా అమలు చేయించారు.నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలపై వాహనదారులకు వివరించారు.రహదారి భద్రత అందరి బాధ్యత అనే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.రోడ్డు ప్రమాదాల తగ్గింపే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని పోలీసులు తెలిపారు.జిల్లా ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ, సురక్షిత ప్రయాణానికి సహకరించాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలియజేసారు

## మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి - జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్ ప్రతినిధి,ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్,శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్ కుమార్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్య లతో కలిసి తహసిల్దార్లు, అటవీ శాఖ అధికారులు, బి ఎస్ ఎన్ ఎల్, ఎయిర్ టెల్, జియో కంపెనీ, టి ఫైబర్ ప్రతినిధులతో సెల్ టవర్ల ఏర్పాటు, ఇంటర్నెట్ సౌకర్యాల కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సెల్ టవర్ల నిర్మాణాలు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బి ఎస్ ఎన్ ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఎయిర్ టెల్, జియో సంస్థలు టవర్ల నిర్మాణాలు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పనపై అవసరమైన స్థలం గుర్తింపు, పాలన పరమైన అనుమతులు త్వరగా పొందాలని తెలిపారు. టవర్ల నిర్మాణాల ద్వారా మారుమూల గ్రామాలకు సెల్ సిగ్నల్స్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, అటవీ అధికారులు,బిఎస్ఎన్ఎల్,ఎయిర్ టెల్,జియో, టి ఫైబర్ సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## రానున్న గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**నిర్మల్ ప్రతినిధి ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్.**

రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.సోమవారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ





ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ గోదావరి నది పుష్కరాల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, రాబోయే గోదావరి నది పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే సంబంధిత అధికారులు అందరితో, పుష్కరాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించినట్లు వివరించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం, పుష్కర ఘాట్ వద్దకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, దానికి తగ్గట్టుగానే ఏర్పాట్లను చేస్తామని చెప్పారు. ప్రతి పుష్కర ఘాట్ వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఘాట్ ల నిర్మాణం, నీటి వసతి, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర వసతులు కల్పిస్తామని తెలిపారు.ఈ వీసీలో డిపిఓ శ్రీనివాస్, నీటిపారుదల ఈఈ అనిల్, జెడ్పీ సీఈవో గోవింద్, ఈఈ ఆర్ డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహణ ... 38 ఫిర్యాదుల స్వీకరణ....అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని 8712659973 వాట్సప్ ద్వారా తెలుపాలి..ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 23,సూర్య మేజర్ న్యూస్**

పోలీసు ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజా ఫిర్యాదులను ఎస్పీ నేరుగా స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారులు నేరుగా జిల్లా ఎస్పీకి తమ సమస్యలను విన్నవించుకున్నారు, వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, త్వరితగతిన సిబ్బంది కేటాయించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. జిల్లా నలుమూలల నుండి దాదాపు 38 ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి తెలియజేశారు. వచ్చిన ఫిర్యాదులలో భూ సమస్యలు, కుటుంబ సమస్యలు, కేసుల పురోగతులపై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి నేరుగా తెలియజేశారు. అసాంఘిక కార్యకలాపాలపై, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్న నేరుగా జిల్లా ఎస్పీ నిర్వహించబడుతున్న వాట్సాప్ ద్వారా 8712659973 నెంబర్ కు సమాచారం అందించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### ప్రత్యేక అవసరాల పిల్లల క్రీడా పోటీల్లో

# అద్భుత ప్రదర్శన

- రాష్ట్రస్థాయి క్రీడల్లో ఆదిలాబాద్ ప్రభంజనం
- 35 పతకాలతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం
- అభినందించిన కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ,ఫిబ్రవరి 23,సూర్య మేజర్ న్యూస్**

హైదరాబాద్లో ఈ నెల 17న నిర్వహించిన తొలి రాష్ట్రస్థాయి ప్రత్యేక అవసరాల గల పిల్లల క్రీడా పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. వివిధ విభాగాల్లో సమిష్టి ప్రతిభతో మొత్తం 35 పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు.ఈ విజయాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా విజేత విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి, క్రీడల్లో మరింత రాణించాలని ప్రోత్సహించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, క్రీడల్లో వారు సాధించిన ఈ విజయం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఉంటే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా రాణించగలరని పేర్కొన్నారు. జిల్లా నుంచి మొత్తం 26 మంది విద్యార్థులు ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు ఉన్నప్పటికీ తమ ప్రతిభను నిరూపించుకుంటూ రాష్ట్రస్థాయిలో అగ్రస్థానాన్ని సాధించడం విశేషమని అభిప్రాయపడ్డారు.విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కోచ్‌ల సహకారం కీలకమని, భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొనేలా అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారులు తిరుపతి, రఘు రమణ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**

నస్పూర్ మండలం తీగల్ పహాడ్ గ్రామానికి చెందిన సంకు విజయ పద్మ, విష్ణు స్వరూప్ లు తమ గోదాములో ధాన్యం నిల్వ చేసినందుకు గాను కిరాయి సొమ్ము ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండల



కేంద్రానికి చెందిన రైతులు తమకు 2007 సంవత్సరంలో ఇచ్చిన భూమిలో తాము సాగు చేసుకుంటున్నామని,డిజిటల్ పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఎన్ రెడ్డి చిన్న రాజయ్య తనకు గల భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఇట్టి పట్టాను రద్దుచేసి తిరిగి తనకు భూమిని అప్పగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం గంగారం నగర్ బస్తికి చెందిన చిప్ప హరీష్ బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వ్యాపారం కొనసాగిస్తున్న విషయంపై వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామ ప్రజలు తమ గ్రామంలోని బి సి కాలనీలో జిల్లా కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ చట్టవిరుద్ధంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమంగా చేపట్టిన పనులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 25న బి ఎం ఎస్ ఆధ్వర్యంలో నిరసన దినం"

**నస్పూర్ ,సూర్య మేజర్ న్యూస్**

ఒడిశాలోని పూరీలో జరిగిన 21వ అఖిల భారత మహాసభలలో ఇచ్చిన పిలుపు మేరకు భారతీయ మజ్దూర్ సంఘ్ (బి ఎం ఎస్) ఫిబ్రవరి 25వ తేదీని దేశవ్యాప్తంగా నిరసన దినంగా పాటిస్తుంది. వివిధ రంగాలు, పరిశ్రమలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడానికి బి ఎం ఎస్ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయము ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. లక్షలాది మంది మిడ్-డే భోజన కార్మికులు ,ఆశా కార్మికులు ఇప్పటికీ తక్కువ గౌరవ వేతనాలను పొందుతున్నారు. అంగన్వాడీ కార్మికులు రోజుకు 10 గంటలకు పైగా పని చేయవలసి వచ్చినప్పటికీ, వారిని ఇప్పటికీ స్కీమ్ వర్కర్లుగా మాత్రమే పరిగణిస్తున్నారు.నిరంతరం పెరుగుతున్న పనిభారంతో మహిళా , శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ తన గౌరవ వేతనాన్ని పెంచడానికి ఇష్టపడటం లేదు, నిరంతరం అదనపు బాధ్యతలను కేటాయిస్తోంది.ఎనిమిది రాష్ట్రాల్లోని నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ మిల్లుల కార్మికులు మహమ్మారి నుండి కేవలం 50% వేతనాలు మాత్రమే పొందుతున్నారు, ఈపీఎస్95 కింద 1,000 కనీస పెన్షన్ మారలేదు, దీనివల్ల లక్షలాది మంది పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు ఉద్యోగులు కూడా వారానికి ఐదు రోజుల పని దినం అమలు కోసం ఆందోళన చేయవలసి వస్తుంది.ఈ తీవ్రమైన ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, దేశవ్యాప్తంగా బి ఎం ఎస్ యూనిట్లు ధర్నాలు, నిరసనలు, ప్రదర్శనలు, ర్యాలీలు, గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నాయి,నల్ల బ్యాడ్జీలు ధరిస్తాయి,ప్రధానమంత్రి,కేంద్ర కార్మిక మంత్రి , సంబంధిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు బి.ఎం.ఎస్.మంచిర్యాల జిల్లా కమిటీ కోరుతుంది.కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా మరియు జాతీయ అభివృద్ధి దృష్ట్యా దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించడానికి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని భారతీయ మజ్దూర్ సంఘ్ మంచిర్యాల జిల్లా కమిటీ తరుపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఏం.ఎస్. జిల్లా అధ్యక్షులు కుంటాల శంకర్, జిల్లా కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్,సింగరేణి పెన్షనర్స్ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షులు కాశెట్టి నాగేశ్వర్ రావు, రీజినల్ కార్యదర్శి లగిశెట్టి కమలాకర్,స్ట్రీట్ వెండర్ కార్మిక నాయకులు మధు,లు పాల్గొన్నారు..




## ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోని వ్వడం లేదని అటవీ శాఖపై
# కలెక్టర్కు గ్రామస్తుల ఫిర్యాదు

**కాగజ్నగర్, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్:**

మా తాతల జమానా నుండి మేము ఇక్కడే జీవిస్తున్నామని మాకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను కట్టుకోనివ్వకుండా అటవీ శాఖ సిబ్బంది



అడ్డుపడుతున్నారని సోమవారం కొత్త సార్సాల గ్రామ ప్రజలు తమకు న్యాయం చేయాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.

# ఖానాపూర్ పట్టణంలో శ్రీ వాసవి కన్య పరమేశ్వరి ఆలయంలో పాల్గొన్న రాజుర సత్యం

**ఖానాపూర్ టౌన్ ఫిబ్రవరి 23 సూర్య మేజర్ న్యూస్**

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీ నగరేశ్వర స్వామి సమేత శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ నవమ 9వ వార్షికోత్సవ మహోత్సవ



కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్న ఖానాపూర్ 11వ వార్డు కౌన్సిలర్ ఖానాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం ఈ కార్యక్రమంలో నాయకులు జన్నారపు శంకర్ ,ఆలయ కమిటీ సభ్యులు మహాజన్ జితేందర్ , అవ్వ బుచ్చన్న ,రాజు ప్రకాష్ , భైర వేణు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో కార్యకర్తకు క్రమశిక్షణ ప్రధానమైన అంశం - జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్

**మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 23,సూర్య మేజర్ న్యూస్ :**

పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ మంచిర్యాల జిల్లా శిక్షణా కార్యశాల ను బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరీ వెంకటేశ్వర్ గౌడ్ అధ్యక్షతన సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని వెంకటేశ్వర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నంగునూరీ వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ పార్టీలో సామాన్య




కార్యకర్తకు శిక్షణ ఇవ్వడం ద్వారా పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. ఆ దృష్టి కోణంతోనే ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి దేశవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు.ఇందులో భాగంగా రాబోయే నెల రోజులపాటు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించే శిక్షణా శిబిరాలలో అధిక సంఖ్య లో కార్యకర్తలకు పార్టీ సంస్థాగత విషయాలు, సిద్ధాంతాలు,ఆధునిక పోకడలు, తదితరా అంశాలపై శిక్షణ ఇస్తామని అన్నారు.పార్టీలో కార్యకర్తకు క్రమశిక్షణ ప్రధానమైన అంశమని, క్రమశిక్షణ లేని కార్యకర్తలను పార్టీ ఉపేక్షించదని అన్నారు.ఎంత పెద్ద నాయకులు అయినా పార్టీ విధానాలకు కట్టుబడి పని చేయాలని సూచించారు.వివిధ మండలాల్లో నిర్వహించే శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలని అన్నారు.ప్రతి మండలంలో శిక్షార్తుల జాబితా తయారు చేయాలని సూచించారు. సుశిక్షితులైన కార్యకర్తల నిర్మాణం ద్వారానే రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి సాధ్యమవుతుందనిఅన్నారు. కొత్త నాయకత్వాన్ని స్వాగతించి, పార్టీ బలోపేతానికి స్థానిక నాయకులందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి సిద్ధం కావాలని అన్నారు.నాయకత్వం లేని మండలాలలో కొత్త నాయకులను పార్టీలోకి ఆహ్వానించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వక్తలుగా ఆసిఫాబాద్ జిల్లా ఇన్చార్జ్ కోమాల ఆంజనేయులు, మంచిర్యాల జిల్లా ఇంచార్జ్ కన్నెబోయిన ఓదెలు,ప్రశిక్షణ అభియాన్ కన్వీనర్ ఎనగందుల కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, శిక్షణ అభియాన్ కోకన్వీనర్లు పట్టి వెంకట కృష్ణ, రాచర్ల సంతోష్, వివిధ మండలాల అధ్యక్షులు జిల్లా పదాధికారులు ప్రత్యేక ఆహ్వానితులు మండల ప్రశిక్షణ టీం పాల్గొన్నారు.



# నేరడిగొండ మండలం సర్పంచ్ ల సంఘంఎన్నిక - అధ్యక్షులుగా ఏలేటి నీలిమ- రవీందర్ రెడ్డి

**నేరడిగొండ ఫిబ్రవరి 23 సూర్య మేజర్ న్యూస్:**



మండలంలోని సర్పంచుల సంఘం అధ్యక్ష ఎన్నికలు సోమవారం జరిగాయి. ఎన్నికను ప్రధాన సలహాదారు రాథోడ్ సజన్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు రాథోడ్ కృష్ణ నాయక్,అధ్యక్షులు ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రూపావత్ వెంకట్ రాం,ఏలేటి మహేందర్ రెడ్డి, ప్రధాన



కార్యదర్శి అడెపు శ్రీకాంత్, కార్యదర్శి జాదవ్ విజయ్ కుమార్,సింగరి వసుందర, కోశాధికారి జాదవ్ కల్యాణి మహేందర్ ప్రధాన సలహాదారు లు రాథోడ్ సజన్ మాజీ ఎంపీపీ, సెడమకి సుజాత గంగాధర్ ప్రచార కార్యదర్శి ఎన్నికలుజరిగాయి.ఈ ఎన్నికలో ఆయాగ్రామల సర్పంచులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లన్న స్వామి వార్షికోత్సవ వేడుకలు

**దస్తురాబాద్, ఫిబ్రవరి23,సూర్య మేజర్ న్యూస్ :**

మండలంలోని గొడిసెర్యాల గ్రామంలోని శ్రీ ధ్యావేరావు మల్లన్న స్వామి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు యాదవ సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం మల్లన్న బోనాలు , పట్నాలతో పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కాగా ఒగ్గు కళాకారులు చేసిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు,కులస్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలించిన సర్పంచ్

**తిర్యాణి , సూర్య మేజర్ న్యూస్**

తిర్యాణి మండల కేంద్రంలో కొమురం భీమ్ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించిన సర్పంచ్ మాడావి రాజేష్



నిర్మాణ పనులు చక చక కొనసాగుతున్నాయి గ్రామపంచాయతీ నిధులతో నిర్మాణ పనులు చేపడుతున్నామని నిర్మాణ పనులు దాదాపుగా అయిపోయాయని ప్లంబింగ్ పనులు కాంపౌండ్ వాల్ పనులు మిగిలి ఉన్నాయని మరో నెల రోజుల్లో పూర్తి నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని సర్పంచ్ మాడవి రాజేష్ తెలిపారు ఈ సందర్భంగా సర్పంచ్ రాజేష్ మాట్లాడుతూ తిర్యాణి గ్రామపంచాయతీ అభివృద్దే ధ్యేయంగా ప్రణాళిక రూపొందించి పలు అభివృద్ధి కార్యక్రమాలకి శ్రీకారం చేపట్టామని ఇందులో భాగంగానే కుమరమ్ భీమ్ చౌరస్తాలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామని ఆయన తెలిపారు.

# 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

**మామడ ,సూర్య మేజర్ న్యూస్ :** ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఏఎస్పీ సాయి కిరణ్ సూచించారు. సోమవారం రెండో దశ అరైవ్ అలైన్ కార్యక్రమంలో భాగంగా మామడ మండలంలోని రాయదారి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు ప్రయాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నిర్వహించని పేర్కొన్నారు కార్యక్రమంలో ఎస్పీ అశోక్ పోలీస్ సిబ్బంది పాల్గొని వాహనదారులకు పలు చూచనలు చేశారు.



# జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్‌న్యూస్ :** నిరుపేద లబ్ధిదారులకు, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం క్రమ మార్గంలో పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య తో కలిసి విజిలెన్స్ కమిటీ సభ్యులు, జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం ను అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. 2026 జనవరి నెలలో 2 లక్షల 54 వేల 21 రేషన్ కార్డులలో 7 లక్షల 52,492 యూనిట్లకు గాను 96.30 శాతంతో 4 వేల 313 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. 100 శాతం రాయితీతో రేషన్ బియ్యం అందించడం జరుగుతుందని, రేషన్ డీలర్లు అర్హత గల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాలని, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తమ పరిధిలోని రేషన్ షాపులను ఆకస్మిక తనిఖీలు చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తారని, రేషన్ డీలర్లు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ యాక్ట్ 1955, 6 ఎ సెక్షన్ క్రింద 13 కేసులు నమోదు చేయడం జరిగిందని, జిల్లాలో వివిధ కేటగిరీల క్రింద మొత్తం 423 చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 969 అంగన్వాడీ కేంద్రాలకు 40 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకం కింద జిల్లాలోని 988 పాఠశాలలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్య అభ్యసిస్తున్న 40 వేల 759 మంది విద్యార్థుల కొరకు 80 మెట్లు ధాన్యం పంపిణీ చేయడం జరుగుతుందని, 112 సంక్షేమ సంస్థలు, వసతి గృహాలకు 320 మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని, రేషన్ బియ్యం తప్పుదారి పట్టకుండా పర్యవేక్షించాలని, రేషన్ బియ్యం దుర్వినియోగపరచిన లబ్ధిదారుల రేషన్ కార్డులు రద్దు చేయబడతాయని తెలిపారు. రేషన్ కార్డులలో చనిపోయిన వారి వివరాలు తొలగించాలని, పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చోర్పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించిన

**సిర్పూర్ యూ ఫిబ్రవరి 23 సూర్య మేజర్ న్యూస్**

లింగాపూర్ మండలంలోని చోర్పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు



సర్పంచ్ మార్సుకోల అనసూయ ప్రారంభించారు.ఆమె మాట్లాడుతూ ప్రతి ఉపాధి హామీ కూలి ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఉపాధి హామీ పథకము ద్వారా చాలామంది కూలీలకు పని లభిస్తాదన్నారు. కూలీలకు వెంటనే డబ్బులు వచ్చేలా చూడాలని టెక్నికల్ అసిస్టెంట్ ని సూచించారు.

# అధ్వానంగా మారిన

## చిలాట్టిగూడా ప్రధాన రహదారి

**సిర్పూర్ యూ ఫిబ్రవరి 23 సూర్య మేజర్ న్యూస్**



సిర్పూర్ యు మండలం పాములవాడ గ్రామపంచాయతీ లోని చిలాట్టిగూడా ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడడం వల్ల వాహనదారులకు చాలా ఇబ్బందికి గురవుతున్నారు. రోడ్డుపై ఉన్న కంకర వల్ల చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. నాయకులు మారుతున్నారు కానీ రోడ్డు మారుతలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా కానీ రోడ్డు పరిస్థితి మారుతలేదని ఆరోపించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మంజూరుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## దిందా గ్రామానికి అభివృద్ధి వరం
### ... వాగుపై వంతెన పనులు వేగవంతం



**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని దిందా గ్రామ శివారులో గల వాగుపై రూ.5 కోట్ల అంచనాతో మంజూరైన వంతెన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ప్రత్యేక చొరవతో ఈ పనులు వేగవంతం కావడం గ్రామస్తుల్లో ఆనందాన్ని నింపుతోంది. ఈ సందర్భంగా శాసనసభ్యులు సోమవారం బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షిస్తూ కాంట్రాక్టర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని స్పష్టం చేశారు. వంతెన అప్రోచ్ రోడ్డుపై కూడా సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులకు ఆదేశించారు.ఈ వంతెన నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో దిందా గ్రామ ప్రజలు ఎదుర్కొనే రాకపోకల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని శాసనసభ్యులు తెలిపారు. దిందా గ్రామస్తుల చిరకాల స్వప్నం నెరవేరబోతుందన్నారు.అదనంగా ఆర్ అండ్ బి రోడ్ నుండి దిందా గ్రామం వరకు బీటీ రహదారి పునరుద్ధరణ మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం కల్పిస్తామని తెలిపారు.గ్రామ ప్రజలు శాసనసభ్యుల చొరవకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఈకెవైసి చేయించుకోవాలని

**సిర్పూర్ యూ ఫిబ్రవరి 23 సూర్య మేజర్ న్యూస్ :**

చోర్ పల్లి గ్రామ పంచాయతీ యందు సోమవారం రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఈకెవైసి కార్యక్రమం అగ్రికల్చర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పాల్గొని తమ ఆధార్ వివరాలతో ఈకెవైసి ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా అందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఈకెవైసి చేయించుకోవాలని అగ్రికల్చర్ ఆఫీసర్ సూచించారు.గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో రైతుల నమోదు ప్రక్రియ విజయవంతంగా నిర్వహించబడింది



# గూడెం గ్రామానికి విద్యుత్ వెలుగులు

## - 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు - గూడెంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 23, సూర్య మెజర్ న్యూస్**

మండలంలోని గూడెం గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు భూమి పూజ నిర్వహించారు. గూడెం సహా పరిసర 23 గ్రామాల్లో చాలా కాలంగా నెలకొన్న



తక్కువ వోల్టేజ్ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రజల సౌకర్యార్థం ఈ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు.గత నెల ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన భట్టి విక్రమార్క మల్లు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విషయం గుర్తుచేశారు. తాజాగా గూడెం గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే భూకేటాయింపు సమస్యను పరిష్కరించి అధికారులతో కలిసి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు సూచనలు చేసిన ఆయన, గ్రామాల్లో అదనంగా విద్యుత్ స్తంభాలు, లైన్లు అవసరమైతే సంబంధిత విద్యుత్ విభాగ ఏఈలను సంప్రదించి దరఖాస్తు చేయాలని సూచించారు. అలాగే గూడెం -- బాబాసాగర్ రహదారి పనులు హ్యామ్ పథకం కింద మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. బెజ్జూర్ నుంచి అహేరీ వరకు గూడెం మీదుగా బస్సు సర్వీసులు పునఃప్రారంభమవడంతో బెజ్జూర్, చింతలమానేపల్లి మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడిందన్నారు . గ్రామాల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు , గ్రామస్థులు పాల్గొన్నారు.



# జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటిచెప్పారు

## -- పోలీస్ క్రీడల్లో ఆదిలాబాద్‌కు 8 పతకాలు

**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 23: మేజర్ సూర్య న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు సిబ్బంది అద్భుత ప్రతిభ కనబర్చి 8 పతకాలను సాధించి జిల్లా కీర్తిని రాష్ట్రస్థాయిలో చాటిచెప్పారని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పతకాలు సాధించిన విజేతలను జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేసి భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి జిల్లా గౌరవాన్ని మరింత పెంచాలని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈ పోటీల్లో మూడు బంగారు, ఒక రజత, నాలుగు కాంస్య పతకాలను జిల్లా కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన పోటీల్లో మహిళా పోలీసు సిబ్బంది విశేష ప్రతిభ ప్రదర్శించారని, ఏఆర్ కానిస్టేబుల్ పి.పూజ 400 మీటర్లు, 800 మీటర్ల పరుగులో రెండు స్వర్ణ పతకాలను సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. అలాగే యోగా విభాగంలో మహిళా కానిస్టేబుల్ రూప ఒక బంగారు, ఒక కాంస్య పతకాన్ని గెలుచుకున్నారని, బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్ రజత పథకాన్ని సాధించగా, రిలే పరుగులో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులతో కలిసి పి.పూజ, ఎం.రోహిణి కాంస్య పతకాన్ని అందుకున్నట్లు వివరించారు. అదేవిధంగా 70 కిలోల బాడీ బిల్డింగ్ విభాగంలో కానిస్టేబుల్ రూప్ సింగ్ కాంస్య పతకాన్ని సాధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి, సీసీ కొండరాజు, కానిస్టేబుళ్లు రూప, రోహిణి, మీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్న ఆలోచన.. పెద్ద మార్పులకు
# దారితీస్తుంది
### - ఘనంగా ప్రపంచ ఆలోచనా దినోత్సవం




**మందమర్రి, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్.** ఆలోచనతోనే అభివృద్ధికి మార్గాలు సుగమం అవుతాయని, చిన్న ఆలోచన ఒక్కటే పెద్ద మార్పులకు దారితీస్తుందని సింగరేణి మందమర్రి ఏరియా ఎస్ఓటు జీఎం జీఎల్ ప్రసాద్, డీవైపీఎం మహమ్మద్ అసీఫ్ లు పేర్కొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెడెన్ పవెల్ జయంతిని పురస్కరించుకుని సింగరేణి పాఠశాల ఆవరణలో సోమవారం స్కౌట్ అండ్ గైడ్స్ ఆద్వర్యంలో ప్రపంచ ఆలోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఓటు జీఎం, డీవైపీఎం బిడెన్ పవేల్ చిత్ర పటాలకు పూలమాల వేసి సర్వమత సమ్మేళన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో మంచి క్రమశిక్షణతో పాటు దేశభక్తి పెంపొందుతుందని అన్నారు. సాహసమే ఊపిరిగా సేవే పరమావధిగా అందరం కలసి ప్రపంచాన్ని మారుద్దామనే సందేశాన్ని బిడెన్ పవేల్ ఇచ్చారని అన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ మంచి క్రమశిక్షణ గల సమాజ నిర్మాణానికి విద్యార్థులు దోహద పడతారన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో సమయ పాలన, సేవాతత్పరత వంటి లక్షణాలను అలవర్చుకోవడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందాలని సూచించారు. స్కౌట్లో శిక్షణ పొందడం వలన ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ లభిస్తుందని వారు తెలిపారు. స్కౌట్లో చేరిన విద్యార్థులు గవర్నర్, రాష్ట్రపతి అవార్డులను సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయుడు జే. పురుషోత్తం, స్కౌట్ మాస్టర్ శక్తికుమార్, గైడ్ మాస్టర్ కల్పలత, పాఠశాల ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్క సుమన్ అక్రమ అరెస్ట్ సరికాదు
### -- జిల్లా జైలులో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శ

**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 23: మేజర్ సూర్య న్యూస్:**
బాల్క సుమన్ అక్రమ అరెస్టు సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా జైలుకు



చేరుకొని బాల్క సుమన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్క సుమన్ అరెస్టు అన్యాయమని, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా నాయకులపై ఇలాంటి చర్యలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేష్, మార్కెట్ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బేర దేవన్న, అశోక్, స్వామి తదితరులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ 49వ వార్డ్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పాశం రాఘవేంద్ర, తాంసి మండల మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ, రఘు, మల్లెల స్వామి, సృజన్, శంకర్, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారం పాఠశాల విద్యార్థులకు గల్ఫ్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిట్స్ అందజేత

**జన్నారం, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :**
జన్నారం మండలం ధర్మారం అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు స్థానిక గల్ఫ్ స్వచ్ఛంద సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ లను సోమవారం గ్రామ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మగ్గిడి తిరుపతి చేతుల మీదుగా



అందజేశారు. చదువుతోపాటు, క్రీడారంగంలో ముందుండాలనే ఆలోచనతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేయడం జరిగిందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు మగ్గిడి తిరుపతి అన్నారు. అనంతరం 48 సంవత్సరాలుగా పాఠశాలలో పి టి డబ్ల్యూ గా సేవలందిస్తున్న గొల్లపల్లి నారాయణ, అలాగే పిల్లలకు మంచి పౌష్టికాహారమైన భోజనాలు పెడుతూ సేవలందిస్తున్న మగ్గిడి లచ్చక్క, చిట్యాల విజయ లను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ కిట్స్ లు అందజేసిన ఫౌండేషన్ సభ్యులను సైతం పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంబడి సత్తన్న, ఫౌండేషన్ సభ్యులు నెమలికొండ కాంతారావు, రాచకొండ రాజేష్, తాళ్లపల్లి వరుణ్, చిట్యాల రాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంత్ గాడ్గే బాబా సేవలు స్మరణీయం

**వాంకిడి, ఫిబ్రవరి 23,సూర్య మేజర్ న్యూస్**
మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం సంత్ గాడ్గే బాబా 149వ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బౌద్ధ గురువు బంతే భరద్వాజ్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్ గాడ్గే బాబా స్వచ్ఛత, సామాజిక సంస్కరణలకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. గ్రామాల వారీగా తిరుగుతూ పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కలిగించడమే కాకుండా, మూఢనమ్మకాలు, సామాజిక కుశీలాలను నిర్మూలించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ పట్ల గాడ్గే బాబాకు ఉన్న గౌరవం విశేషమని, అంబేద్కర్ కూడా గాడ్గే బాబా సేవలను మెచ్చుకున్నారని తెలిపారు. అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఆదర్శనీయమని, మహారాష్ట్రలో పాఠశాలలు, వసతిగృహాలు స్థాపించడంలో ముందుండారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రోషన్ ఉప్రే, శ్యామ్‌రావు లహుజీ దుర్గే, బల్వంత్ ఉప్రే, దుర్గం దీపక్, రమేష్ డోంగ్రే, విఠల్ చునార్కర్, విద్యాసాగర్, వివేక్, స్వాగత్, వేంకటి జాడే, ప్రశాంత్ జాడే, మనోజ్ దుర్గే, రెంటికీ బుద్ధాజీ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో తృతీయ బహుమతి అందుకున్న అస్మ

**జన్నారం, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :**
జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని అస్మ కరాటే పోటీల్లో 16 సంవత్సరాల్లో 47 కేజీలతో జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఎంపికై కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి ఐదువేల రూపాయల



నగదుతో పాటు మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, స్పోర్ట్స్ లెక్చరర్ మైసా కుమారస్వామి, అధ్యాపక బృందం నాగేశ్వరరావు, బాపురావు, సాయికుమార్, రవీందర్, దేవేందర్, మోహన్, స్వరూప, శశికళ, కుమారస్వామి కరుణాకర్, శివ రాములు విద్యార్థిని అస్మను అభినందించారు.

## బేలలో బీజేపీ నాయకుల ధర్నా..

**బేల, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి క్యాంప్ ఆఫీస్ పై దాడి కీ నిరసనగా సోమవారం మండల బీజేపీ నాయకులు మండలకేంద్రం లోని అంత రాష్ట్ర రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ



మండల అధ్యక్షుడు ఇంద్ర శేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తుందని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే గుణపాఠం చెపుతారని అన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు రాకేష్, సందీప్, రాము బర్కడే, జీవన్ ధర్నె, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## శనగ పంటకు నిప్పు పెట్టిన దుండగులు.

**బేల, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :** బేల శివారంలో గల 3ఎకరాల పొలంలో అంకత్ వార్ శంకర్ డోప్టాల గ్రామ కౌలు రైతు తను పండించిన శనగ పంటను గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. ఆరుగలం కష్టపడి పండించిన శనగ పంట చేతి కొచ్చే సమయంలో కాలి బూడిదయిందని, మూడు ఎకరాల్లో శనగ పంటను సాగు చేశానని, చేతికొచ్చిన పంటను కుప్ప చేసి పెట్టానని ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టారని, దాదాపుగా 20 నుండి 30 క్వింటాల పంట దిగుబడి వచ్చేది అని దింతో తనకు లక్ష యాభై వేల రూపాయలు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.



## ఓపెన్ కరాటే అండ్ కుంగ్-ఫు లో గోల్డ్ మెడల్స్ సాధించిన బెల్లంపల్లి విద్యార్థులు



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్:**
ఇటీవల నిర్వహించిన 9వ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ కరాటే అండ్ కుంగ్-ఫు ఛాంపియన్‌షిప్--2026 పోటీలలో స్థానిక అభ్యాస పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాలలో పాల్గొన్న విద్యార్థులు మొత్తం 23 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్, 1 బ్రాంజ్ మెడల్ సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను అభ్యాస స్కూల్ బెల్లంపల్లి కైవసం చేసుకుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మాస్టర్ మల్లెపల్లి జితేందర్, మేనేజర్లు మల్లెపల్లి సాయి ప్రసన్న, గడిపెల్లి ప్రవళిక, ప్రిన్సిపాల్ నస్రీన్, పిటి టీచర్ సంధ్య పాల్గొన్నారు. కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నస్రీన్ మాట్లాడుతూ కరాటే ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక పరిపక్వత పెంపొందుతాయని, క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా ఉత్తమ భావి భారత పౌరులుగా ఎదగవచ్చని తెలిపారు. కరాటే శిక్షణ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు, చదువుతో పాటు బహుముఖ ప్రజ్ఞను అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నారు.

## వెలిగి శివారులో ప్రభుత్వ భూమి ఆక్రమణలపై చర్యలు

**వాంకిడి, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్**
మండలంలోని వెలిగి శివారు ప్రాంతంలో ప్రభుత్వ భూమిపై అక్రమ ఆక్రమణలు జరిగిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. సర్వే నంబరు 58/1లో కొంతమంది తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అధికారులు, జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు సోమవారం స్థలాన్ని సందర్శించారు. ప్రభుత్వ భూమిలో ఎటువంటి ఆక్రమణలు సహించబోమని స్పష్టం చేస్తూ అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. భూమిని ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో గిర్ధవర్ శైలజ, సర్వేయర్ రామకృష్ణ, గ్రామ పాలనాధికారి రాజేశ్వర్‌తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## డిగ్రీ కాలేజీలో సర్టిఫికెట్ తో కూడిన నృత్య శిక్షణ ప్రారంభం.

**కాగజ్నగర్, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :**

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్యాన్స్ లో సర్టిఫికేట్ కోర్సు ప్రారంభించినట్లు




కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ సుధాకర్ నేతృత్వంలో 15 రోజుల పాటు జరిగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు శాస్త్రీయ, జానపద విభాగాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా సాధికారత విభాగం ఇన్చార్జ్ మాట్లాడుతూ ఈ శిక్షణ కొరకు 50 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరై శిక్షణ లో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న తండ్రి కొడుకు

**రామకృష్ణాపూర్ ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్**

హైదరాబాద్‌లో జరిగిన 4 వ తెలంగాణ రాష్ట్రస్థాయి స్పోర్ట్ ఏ గేమ్స్ పోలీస్ మీట్‌లో రామకృష్ణాపూర్‌కి చెందిన మోద్యల్ శ్రీనివాస్ అతని కుమారుడు




శివకృష్ణ ఇద్దరు మన జోన్ తరుపున ఈ పోటీల్లో బాస్కెట్ బాల్ లో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించారు, తండ్రి గతంలో కూడా అన్నో మెడల్స్ సాధించగా కొడుకు ఆలిండియా పోలీస్ మీట్ లో పాల్గొన్నాడు వీరిద్దరినీ సోమవారం రామగుండం సీపి ప్రత్యేకించి అభినంచి రివార్డ్ ప్రకటించరు. ప్రస్తుతం తండ్రి భూపాలపల్లి జిల్లా లో హెడ్ కానిస్టేబుల్‌గా కొడుకు కానిస్టేబుల్‌గా మంచిరాల లో క్లూస్ టీం విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు,

## ఎల్లూరులో హై వోల్టేజ్...ఇళ్లలో పరికరాలు దగ్ధం

**పెంచికల్ పేట్ ,ఫిబ్రవరి 23,సూర్య మేజర్ న్యూస్ :**

పెంచికల్ పేట్ ఎల్లూరు గ్రామంలోని ఎస్సీ వాడలో అధిక విద్యుత్ ప్రవాహం కారణంగా మరోసారి ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. ఇళ్లలో ఉన్న



విద్యుత్ మీటర్లు, స్విచ్ బోర్డులు, టీవీలు, మొబైల్ ఫోన్లు, ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్లు తదితర పరికరాలు కాలిపోయాయనీ, గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆరోపిస్తున్నారు. ఈ నిర్లక్ష్యమే వరుస ఘటనలకు కారణమవుతోందని వారు ఆవేదన వ్యక్తం



చేస్తున్నారు. ఇటీవల విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాల్లో పెద్ద ప్రమాదం తప్పినప్పటికీ, దుర్గం దేవాజీకి విద్యుత్ షాక్ తగిలడం ఆందోళన కలిగిస్తోందనీ, భవిష్యత్తులో ప్రాణనష్టం జరిగితే బాధ్యత ఎవరిదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. గ్రామ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం అధికారులు వెంటనే స్పందించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎల్లూరు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బెల్లంపల్లిలో మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో నిరసన

## - నాగర్ కర్నూల్ ఘటనలో పసిపాప మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్:**

నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మేరలో మండలంలో కుల వివక్ష కారణంగా రెండు నెలల పసిపాప మృతి చెందిన ఘటనపై బాధ్యులపై వెంటనే కఠిన చర్యలుతీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకునూరి రాజ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్ నాయకత్వంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుక రాజనర్సు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మేరలో మండల కేంద్రంలో జరిగిన మల్లన్న జాతర సందర్భంగా దైవ దర్శనానికి వెళ్లిన బీసీకి చెందిన రజక కుటుంబం, ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళపై అగ్రకుల దురహంకారంతో దాడి చేసి, రెండు నెలల పసిపాప మృతికి కారణమైన ఘటన అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. కుల ఆధారిత వివక్ష కారణంగా పసిపాప ప్రాణాలు




కోల్పోవడం అత్యంత విషాదకరమని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన తుకారాం రెడ్డి, మధుకర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి లను వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించి, కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కుల ఆధారిత హింసకు స్థానం లేదని ప్రభుత్వం స్పష్టమైన సందేశం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారపు కోళ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకునూరి రాజ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్, జిల్లా కార్యదర్శి ఇడిగిరాల ప్రసాద్, పట్టణ గౌరవ అధ్యక్షుడు ఆరేపెల్లి రమేష్, యువజన నాయకులు గద్దల కుమార్, సీనియర్ నాయకులు పల్లె రమేష్, నాథరి భీమయ్య, ఎరుకల సంఘం జిల్లా నాయకుడు ఉండాడి మల్లయ్య, పట్టణ నాయకుడు ఆరేపెల్లి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలకు పాదయాత్ర!

**కాగజ్ నగర్, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :**

సాధారణంగా కిలోమీటర్ , రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటే బైకు, ఆటోలో మనం వెళతాము. కానీ వందల కిలోమీటర్లు వెళ్లాలంటే రైలు, బస్సు, లేదా కారు లో మనం వెళ్లడం చూసి ఉంటాము. కానీఇందుకు



భిన్నంగా అరుదుగా కొందరు యువకులు సాహసాలు చేస్తుంటారు. కష్టాల్లో ఉన్నప్పుడు, వారి కష్టాలు భగవంతుడు తీర్చాలని మొక్కుకొని , దేవుడికి ఇచ్చిన , మొక్కుకున్న మాట ప్రకారం కొంతమంది చేస్తుంటారు. ఇలాంటి కోవకి సంబంధించిన ఘటన కాగజ్ నగర్ మండలం మోసం గ్రామపంచాయతీ పరిధిలోగల ఆరెగూడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు సాహస పాదయాత్రకు పూనుకున్నారు. స్వయంగా ఏడుకొండల వెంకటేశ్వర స్వామికి వారు మొక్కుకున్నారు. తమ కష్టాలను తీరిస్తే పాదయాత్ర గా తిరుమల తిరుపతి దేవస్థానం, ఏడుకొండల పైకి వస్తామని మొక్కుకున్నారు. దీంతో వెంకటేశ్వర స్వామి వారు మొక్కుకున్న విధంగా కష్టాలను, ఇబ్బందులను దూరం చేసి వారి మొ క్కులను తీర్చి, కరుణించాడు. దీంతో గ్రామానికి చెందిన చౌదరి లక్ష్మణ్ (48,),భీమన్ కార్ మంగాజి ( 36) ఈనెల 20 వ తేదీన అనుకున్న విధంగా పాదయాత్రను ప్రారంభించారు. ఈ గ్రామం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి సుమారు 825 కిలోమీటర్ల సుదీర్ఘ ప్ర యాణం చేయాల్సి ఉంటుంది. అనుకున్న విధంగా ప్రణాళిక ప్రకారం వారు ఈనెల 20 వ తేదీన గ్రామంలోని పోచమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించుకుని, పాదయాత్రగా బయలుదేరారు. అనంతరం అదేరోజు సాయంత్రం ఈస్ గాం శివ మల్లన్న దేవాలయం కు పాదయాత్రగా చేరి ఇక్కడ శివయ్య దర్శనం చేసుకున్నారు. ఇక్కడ రాత్రి బస చేశారు. ఈ విధంగా వారు 4 రోజులలో మంచిర్యాల వరకు చేరుకున్నారు. ఈరోజు శ్రీరాంపూర్‌లో గల ఆంజనేయస్వామి ఆలయంలో నిద్రించి అక్కడినుంచి మళ్లీ రేపు పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. పాదయాత్ర గూగుల్ మ్యాప్ ద్వారా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గతంలో భీమన కార్ మంగాజి సంవత్సరానికి 3 సార్లు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వెళ్లి వస్తూ ఉండేవాడినని తెలిపారు. కానీ చౌదర్ లక్ష్మణ్ కు ఇదే మొదటిసారి. కష్టాల్లో ఉన్నప్పుడు 2004 సంవత్సరంలో వెంకటేశ్వర స్వామి కి మొక్కుకున్నారు. ఎలాగైనా ఏడుకొండల పైకి వచ్చి మొక్కను తీర్చుకుంటానని దృఢంగా , పట్టుదలతో ఉన్నారు. ఎలాగైనా పాదయాత్ర చేసి తీరాలని మనసులో బలంగా నాటుకోడంతో, మంగాజి సహకారం కోరారు. దీనికి మంగాజి ఒప్పుకోవడంతో ఇద్దరు కలిసి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్తున్నారు. వీరీ పాదయాత్రకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా విజయవంతంగా సాగి, వెంకటేశ్వర స్వామికి మొక్కలు తీర్చుకోవాలని మనమంతా మనసారా ఏడుకొండల వెంకటేశ్వర స్వామిని .. కోరుకుందాం..

## షి టీమ్ డెకాయ్ ఆపరేషన్

**మంచిర్యాల టౌన్, సూర్య మేజర్ న్యూస్ :**




మంచిర్యాల పట్టణం లోని రాముని చెరువు పార్క్ వద్ద వెకిలి చేష్టలు చేస్తున్న ముగ్గురు ఆకతాయిలను పట్టుకున్న మంచిర్యాల జిల్లా షి టీమ్. మంచిర్యాల పోలిస్ స్టేషన్ పరిధి లో రామగుండం కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపీ ఆధ్వర్యంలో సోమవారం రాముని చెరువు పార్క్ వద్ద వెకిలి చేష్టలు చేస్తున్న ముగ్గురు ఆకతాయిలను మంచిర్యాల షి టీమ్ సిబ్బంది డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించడం జరిగింది అని మంచిర్యాల షి టీమ్ ఎస్సై హైమ తెలిపారు. ఎవరైన విద్యార్థినిలను ఆకతాయిలు వేధింపులకు గురైనట్లయితే వెంటనే డయల్ 100, రామగుండం షీ టీం నెంబర్ 6303923700,ఫోన్ చేసి, లేదా వాట్సప్ ద్వారా సమాచారం ఇవ్వచ్చు అన్నారు . ఈ డెకాయ్ ఆపరేషన్ లో ఎస్ ఐ, వెంట షీ టీం సిబ్బంది శ్రవణ్, జ్యోతి, శ్రీలత లు పాల్గొన్నారు.

## సర్పంచులకు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

**పెంచికలపేట్, ఫిబ్రవరి 23, సూర్య మేజర్ న్యూస్ :**

పెంచికల్ పేట్ మండలంలోని సర్పంచులు, వార్డు సభ్యులకు కాగజనగర్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి ఆల్బర్ట్ తెలిపారు. గ్రామపంచాయతీలకు వచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించి పంచాయతీ అభివృద్ధిని సాధించేందుకు పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. సర్పంచ్ పాలకవర్గం గ్రామపంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఆల్బర్ట్ సూచించారు. పారిశుద్ధ్యం, మంచినీరు, వీధి దీపాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సభ్యులకు ఆదేశించారు. ఈ శిక్షణల ద్వారా పంచాయతీల అభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



